# మృత్యుంజయుడు

ఎత్తుగా ఉన్న బూరుగు చెట్టుని దాని మీదుగా నీలాకాశంలో నిశ్చలంగా ఉన్న తెల్ల మబ్బుని చూస్తూ నిలబడ్డాడు అప్పలకొండ.

అతనికా చెట్టుతో ముప్పై యేళ్ళ పైగా అనుబంధం వుంది. దాన్ని కొట్టేయమని మార్కండేయులు అతనితో వారం రోజులుగా చెప్తున్నాడు. మార్కండేయులుతో అప్పలకొండ అనుబంధం బూరుగు చెట్టు కంటే పాతది.

మార్కండేయులి తండ్రి నలభై యేళ్ళ క్రితం ఆ ఇల్లు కట్టి దాంట్లో అప్పలకొండ తండ్రిని పాక వేసుకొని ఉండమన్నాడు. ఆ ఇంట్లోకి వచ్చేసరికి అప్పలకొండకి రమారమి పదేళ్ళున్నాయి. మార్కండేయులు వయస్సు కూడా అంతే. ఇద్దరూ కలిసే పెరిగారు. ఆడుకొన్నారు. ఆత్మీయతలు పెంచుకున్నారు. అప్పలకొండకా చెట్టు కొట్టడం బాధగా వుంది.

కాని ఆ చెట్టుంటే చెడు జరుగుతుందని ఎదురింటి సుబ్బారాయుడు మరికొంతమంది మార్కండేయులుకు చెప్పారు. అప్పట్నుంచి మార్కండేయులు చెట్టు కొట్టించేయాలన్న నిర్ణయంలో ఉన్నాడు.

'మార్కండేయులు బాబుకి సెడు జరగటం నాకు మాత్తరం బాధ కాదూ! కాని సెట్టుకి, సెడుకి ముడెట్టటం.... ఏటో నమ్మ బుద్దేయటం నేదు. అసలు మార్కండేయులు బాబుకీ నమ్మకాలు మొదట్నో నేవు. అయిదేళ్ళ కితం గుండె పోటొచ్చి తగ్గిన నాట్నుంచి ఏటో ఎవరేటి సెప్తే అద్నమ్ముతున్నాడు. ఎర్రోడు!మరోసారి సెప్పి సూడాలి' అనుకున్నాడు అప్పలకొండ.

ఇంతలో మార్కండేయులు గొడ్డలి, తాళ్ళు లోపల్నించి తీసుకొని బయటకు వచ్చి అక్కడే నిలబడి ఉన్న అప్పలకొండని,

"టిఫిన్ తిన్నావా?' అని పలకరించాడు. 'తిన్నాను' అన్నాడు అప్పలకొండ.

"అయితే సింహాద్రి కూడా వస్తే పని మొదలు పెట్టచ్చు" అని "సింహాద్రీ!" అంటూ అప్పలకొండ కొడుకు కోసం కేక వేశాడు మార్కండేయులు. సింహాద్రి పాకలోంచి బయటికి వచ్చాడు. అతడి వెంట అతని తల్లి, పరికిణి జాకెట్టు వయస్సు పిల్ల, నిక్కరు వయస్సు తమ్ముడు కూడా బయటికి వచ్చారు. అప్పుడు తప్పని సరిగా అప్పలకొండ గొంతు సరి చేసుకొని తుది ప్రయత్నం చేశాడు. "మరోపాలి సెప్పానని కోపగించుకోకు మార్కండేయులు బాబు! ఇన్ని సంవచ్చరాలుగా ఈ సెట్టుంది. మనింటో మనకేటైనా సెడు జరిగిందా! ఇన్నాళ్ళు రాని ఉప ద్రొవం ఈ నాడేటొచ్చీసి నాదని ఈ సెట్టు కొట్టేయాల! ఈ సెట్టు దూదితో నీకు నీ కుటుంబానికి పరుపులు తలగడలు అమరిపోతున్నాయి కదా. ఈ సెట్టుండటం ఒల్ల నీకు సుకమే గాని కట్టం నేదు కదా" అని మార్కండేయులుకి మరోసారి చెప్పి చూశాడు అప్పలకొండ.

"అవున్లే ఎన్నిసార్లైనా చెప్పుతావు! ఈ చెట్టుంటే నీకంతా లాభమే, మేం కొత్త పరుపులు దిళ్ళు కుట్టించుకొంటే ఒకటో ఆరా పాతవి నువ్వు పట్టుకు పోతావు. ఇంట్లో బూరుగు చెట్టుంటే ఇంటి యజమానికి ప్రమాదంఅని ఇంతమంది ఎందుకు చెప్తున్నారంటావు! చెట్టుకొట్టేస్తే వాళ్ళకేం లాభం!" అన్నాడు మార్కండేయులు.

"ఏటో బాబు! పట్టణం పెరిగిపోతోంది కదా అని సంబరపడిపోనాం మనమందరివి. పై ఊర్ల నుంచి జనాలొచ్చి పడిపోనారు మన ఊరు మీద, ఆళ్ళ రాకతో ఎన్ని ఇసిత్రాలు ముందు మనకి తెలీనివి తెలిసొస్తున్నాయి. అరిటి పిలక అందరికి అచ్చి రాదంట. బూరుగు సెట్టుంటే మంచిది కాదంట. కొబ్బరికాయ పైచ్చమంట, అదంట ఇదంట. మన సిన్నప్పుడు తాగడానికి ఉప్పు నీరే కాని తియ్య నీరు లేదు. తినడానికి ఆల్లిపళ్లే కాని అబ్బురపుపళ్ళు లేవు. కరేపాకే కాని కొత్తిమీర నేదు. ఇసక దిబ్బలంట బిల్లగన్నేరు పూలే గాని తోటల్లో గులాబీ పూలు

లేవు. ఇప్పుడుబిల్లగన్నేరు పూలని ఇళ్ల నుంచి గోరీలకి తరిమేశాం. డబ్బున్న మారాజులు మనూరికొచ్చి మనికి నాజూకులు మప్పేసారు. ఆళ్ళు ఊరంతా కొనేస్తుంటే మనం ఊళ్ళట్టుకు పోతున్నాం. ఆళ్లమంచే మన సెడు బాబు! అంతకు మించి వేరేటి సెడు నేదు." "అప్పలకొండారే! చెప్పినపని చెయ్యకుండా ఉపన్యాసం దంచేస్తున్నావు ! నువ్వు ఏదో పార్టీలో జేరిపో అదృష్టం బాగుంటే మంత్రివి గావచ్చు మిగతావాటి మాటెల్లా ఉన్నా. బూరుగు దూది కంట్లో పడ్తే కళ్లు పోతాయిరా. కనీసం అదైనా ఒప్పుకొంటావా ? అందుకైనా చెట్టు కొట్టేయొచ్చు. ఏమంటావు?' మార్కండేయులు మరో వైపు నుంచి వాదం కొనసాగించాడు.

" బూరుగుదూది కంట్లో పడి కళ్ళు పోనాయంటూ కన్నాసుపత్రి కొచ్చినోడెవరు నాకగుపించ లేదు. కాని బోపాల్లో కల్లు పోయి నోల్లవి బాగల్పూరులో కల్లు పోగొట్టుకొన్నోల్లని మనింటో టి.వి.లో సూపిస్తే శానా మందినే సూశా. మార్కెండేయులు బాబు, మన బిడ్డలు సిన్నప్పుడు బూరుక్కాయ పగిలి దూది గాలిలో ఎగురుతుంటే దానెనకాతల వెర్రోల్లలాగా పరిగెత్తే వోల్లు. ఇప్పుడు మనం పరిగెత్తుతున్నాం వెర్రోల నాగ లచ్చిం తల్లి యెనకాతల ఆశతో, సావు నుంచి దూరంగా బయంతో, ఊసులకేం గాని బాబు సెట్టు కొట్టమాకు" అని బతిమాలాడు అప్పలకొండ.

" ఇది నా ఇల్లు. నా చెట్టు నేను కొట్టడానికి నిర్ణయం చేసేశాను. నువ్వు కొడ్తే కొమ్మా, కొయ్యా, నీకే దక్కుడు. లేదంటావా ఊళ్ళో డబ్బిచ్చి మరీ కొట్టుకుపోయే వాళ్ళు బోలెడు మంది". అన్నాడు మార్కండేయులు.

"ఇన్నాళ్ళూ ఇది మనిల్లు, మన సెట్టు అనుకున్నాను బాబు. ఆ రాతింట్లోనువ్వు పెరిగావు. ఆ మట్టింటో నేను పెరిగాను. కాని కలిసే పెరిగాం. ఆ సనువు మీద ఏటేటో మాటాడేసినాను. ఏటనుకోకు బాబు" అని అప్పలకొండ మార్కండేయుల్తో అని.

"ఏట్రా సిమ్మాద్రి! రాట్నాగనిలబడిపోనావు. ఆ తాడూ గొడ్డలి అందుకో" అన్నాడు కొడుకు సింహాద్రితో.

సింహాద్రి తాడు పుచ్చుకొని జాగ్రత్తగా చెట్టుపైకి ఎగబాకాడు. సూర్యుడు తూర్పున ఎగబాకుతున్నాడు.

"సెట్టు ఇటు వైపు పడాల. ఇటు కొమ్మకి ముడెయ్యి. అది పెళుసు కొమ్మరా కొడకా! వలంపాటి దానికి ముడెట్టు" అంటూ కింద నుంచి అప్పలకొండ సలహాలిస్తుంటే సింహాద్రి తాడు ఒక కొస కొమ్మకి గట్టిగా ముడివేసి మిగతాతాడు జాగ్రత్తగా జారవిడస్తూ తను చెట్టుదిగాడు.

అప్పలకొండ చెట్టు పడాల్సిన వైపు మూడంగుళాల గంటు పెట్టాడు మానుకి. ఇటు పనయ్యాక రెండో వైపు మానుని ఆదే ఎత్తులో కొట్టసాగాడు. చెట్టుకి కొద్ది పట్టుండగా

సింహాద్రికి గొడ్డలిచ్చి తను తాడు కట్టిన వైపుకి వచ్చి తాడుకి బిగువు వచ్చేలా లాగి నిలబడ్డాడు.

"ఆ కోసా పట్టు తప్పించీ" అని కొడుక్కి సూచించాడు. సింహాద్రి నాలుగు దెబ్బలు గట్టిగా కొట్టగానే చెట్టు ఫెళఫెళామంటు విరిగి వడి హెచ్చుతూ పడ సాగింది, అప్పలకొండ వైపు. అప్పలకొండ తాడు వదలి తప్పుకోబోయాడు. నేల మీదున్న తాడు కాలికి బందం పడి పడ్డాడు. అటు వైపున ఉన్న సింహాద్రికి అటు వచ్చి తండ్రిని లాగే ఉసులు లేదు. మార్కండేయులుకి వసులున్నా దూరంగా ఉండటం వల్ల వచ్చి లాగే వ్యవధి లేకపోయింది. "అయ్యా! తప్పుకో' అని సింహాద్రి, "తప్పుకో" అంటూ మార్కండేయులు అరవటం మినహా మరేసాయం చెయ్యలేకపోయారు.

ఆ అరుపులకి కింకర్తవ్యతామూఢత వదిలి అప్పలకొండ అవకాశం ఉన్న మేరకు సర్వశక్తులు కేంద్రీకరించి చెట్టుకు దూరంగా జరిగాడు. పడ్తున్న చెట్టు, కొమ్మల బరువు తేడాకి కొద్దిగా తిరిగిపడడంతో చెట్టు అనుకొన్న విధంగా కాక అప్పలకొండ పూరింటి మీద కొన్ని కొమ్మలు ఆనేలా పడింది. ఆ కొమ్మలల్లా ఆని పడటం వల్ల ఇంటికి కొంత దెబ్బ తగిలినా అన్ని కొమ్మలు విరిగే దాక చెట్టు పడటం ఆలస్యం అయింది. ఆ ఆలస్యం కొద్ది క్షణాలు మాత్రమే! అప్పటికే కొన్ని కొమ్మలు అప్పలకొండని బలంగానే తాకాయి. రక్తం చివ్వున చిమ్మింది.

చెట్టుని కొడుతుంటే, చెట్టు పడటంలాంటి అద్భుత దృశ్యాన్ని సింహాద్రి తరువాతి పిల్లలకి చూపిద్దామని అప్పలకొండ భార్య వాళ్ళతో నిలబడి ఉంది. ఆమె మొగుడు పడటం, అతని మీద కొమ్మలు పడి రక్తం చిమ్మటం చూడగానే గుండెలు బాదుకొంటూ "ఓర్నాయనో! నానేటి సేద్దునో"అంటూ రాగాలందుకొంది.

ఏడుపు విని పరిగెత్తుకొచ్చిన జనం సహాయంతో సింహాద్రి, మార్కండేయులు కొన్ని కొమ్మలు విరిగి పడిన చెట్టును కొద్దిగా ఎత్తి అప్పలకొండను తప్పించారు. పక్కింటి కుర్ర డాక్టరు వచ్చి పరీక్షించి దెబ్బలు బాగానే తగిలాయని అవి ప్రమాదకరమైన వేనని తేల్చి రక్తం పోకుండా ప్రథమ చికిత్స చేసి అంబులెన్స్‌కి ఫోను చేయించాడు. అప్పలకొండను అంబులెన్సులో ఎమర్జెన్సీ వార్డుకి తీసుకు వెళ్ళారు. అన్ని ఖర్చులకి తను హామీ నిలబడ్డాడు మార్కండేయులు.

"చెట్టు కొట్టమనకుండా ఉండాల్సింది. చెట్టు కొట్టకపోతే నా ప్రాణం పోయేదో లేదో, దాని కొట్టడం వల్ల అప్పలకొండ ప్రాణం పోయేటట్టుంది. నా ప్రాణం ఆ చెట్టుంటే పోయేదో లేదో కాని అప్పలకొండ ప్రాణం పోతే దానికి కారణం మాత్రం నేనే అవుతాను." అనుకొన్నాడు మార్కండేయులు.

ఆతనెదురుగా అప్పలకొండ భార్య, కొడుకు దిగాలు పడి కూర్చున్నారు. ఇన్నాళ్ళుగా వాళ్ళు తమని నమ్ముకుని తన వల్ల వాళ్ళకి మేలే జరుగుతుందని కీడు జరగదని నమ్ముతూ వచ్చారు. తాము కూడా అప్పలకొండ కుటుంబాన్ని పరాయిగా ఎప్పుడూ చూడ లేదు. ఏదో చెట్టు కొట్టిద్దామనుకొన్నాడే గాని ప్రమాదం జరుగుతుందని కలలో కూడా ఊహించలేదు. ఈ మధ్య తనెందుకో చావును తప్పించుకోవాలనే ప్రయత్నంలో పడ్డాడు! ఆ విధంగా

మార్కండేయుల్ని ఆ రోజు జరిగిన ప్రమాదానికి తన బాధ్యత ఉందన్న ఆలోచన బాధ పెడుతుంటే తను కారకుడే అయినా కావాలనీ కాలేదని, అప్పలకొండ పట్ల తను తీసుకొంటున్న శ్రద్ధవల్ల అతను కోలుకుంటాడనీ అతని కుటుంబం తనని తప్పు పట్టదని నచ్చ చెప్పుకోసాగాడు.

అయిదు సంవత్సరాల క్రితం వరకు మార్కండేయులు తన చావు గురించి పెద్దగా ఆలోచించ లేదు. భయపడలేదు. అప్పటి నుంచి ఆలోచించడానికి కారణం అతనికి అయిదు సంవత్సరాల క్రితం గుండె కండరాలలో ఓ భాగానికి ప్రాణవాయువు అందక గుండె పోటు రావటమే! కొడుకు చదువు పూర్తి కాలేదని, కూతురికి పెళ్ళి చెయ్యలేదని తను అర్థాంతరంగా పోతే భార్యా పిల్లల గతేమిటని భయం పట్టుకుంది.

అయితే అతనికి సమయంలో సరైన వైద్య సహాయం లభించడంతో బతికి బట్ట కట్టాడు. అతన్ని బతికించుకోడానికి అతని భార్య వెంకటేశ్వర స్వామి పాదాలకి తాకించిన కొత్త మంగళసూత్రాలు ధరించింది. అతని తల్లి మృత్యుంజయ జపం, రుద్రాభిషేకం చేయించింది. ఇవన్నీ అతనికి మృత్యువుతో పోరాడ్డానికి శక్తినిచ్చాయి. కాని ఆ తరువాత అందరు మాటి మాటికి వాటి ప్రసక్తితేవటం చేత పూర్తిగా వాటివల్లే బతికాడని నమ్మసాగాడు. అందుకని తను అర్థాంతరంగా చావకుండా ఉండటానికి, చావుకి కారణాలని తొలగించుకోవాలనుకొన్నాడు. జాతకం వ్రాయించుకొన్నాడు. ప్రాణం గండాల నుంచి రక్షించుకోడానికి పూజలూ పునస్కారాలూ, కళ్యాణాలూ కార్యాలూ చేస్తూ, చేయిస్తూ వచ్చాడు. గ్రహాల్ని శాంతింప చెయ్యజూశాడు.

తల్లిపోయిన సంవత్సరం కన్యా దాన ఫలం కోసం కూతురికి వెంటనే పెళ్ళి చేశాడు. మనవడు పుడ్తే అమర్‌నాథ్ పేరు పెట్టాలని మనవరాలు పుడ్తే ఆ పిల్లకి అమృత అన్న పేరు పెట్టాలని అల్లుడిని ఒప్పించాడు.

ఏడాది క్రితం అతని వియ్యంకుడుపోయినప్పుడెవరో "వియ్యంకుడు పోయినప్పుడు నువ్వూ, వియ్యపురాలు పోతే మీ ఆవిడా పోరాదు" అని శాస్త్రంలో అయిదవ పుటలో ఆరో నిబంధన ఉందన్నంత ఖచ్చితంగా చెప్పినప్పుడు వెళ్ళటం మానేశాడు.

అరటి పిలకలు అందరికి ఇళ్ళల్లో అచ్చిరావు అని ఎవరో అంటే నలభై ఏళ్ళగా ఆ ఇంట్లో ఉంటున్న అరటి చెట్లను సమూలంగా ఎందుకైనా మంచిదని పీకించేశాడు. పెళ్ళాన్ని నల్లపోగున్న చీరని కట్టొద్దన్నాడు.

ఇంట్లో బూరుగు చెట్టుండరాదని కొట్టించేయమని నలుగురైదుగురు కొద్ది రోజులుగా అతనికి చెప్తూ వచ్చారు. వాళ్ళకందులో ఏమీ స్వార్థం లేదు అని మార్కండేయులు నమ్మాడు.

"నేదో! ఉందో! ఆరో మాట సెప్తారు. నువ్వా పని సేస్తావు. ఎప్పుడు సేత్తావు. నువ్వు బయపడినప్పుడు. అంటే ఆళ్లు నిన్ను భయ పెట్టి నీ బుద్ధి మీద ఆదిపత్యం సంపాదించారన్న మాట. నిన్ను ఆళ్ళ మాట ఇనేలా సెయ్యటంలో స్వార్థం ఉందో నేదో! తెలవదు" అంటూ అడ్డుపడి చూశాడు అప్పలకొండ. అతని మాట నెగ్గ లేదు. మార్కండేయుల పిరికితనం

నెగ్గింది.

చెట్టు కొట్టాడు. చెట్టుకింద పడి రక్తం కార్చాడు అప్పలకొండ. అతని రక్తం చూసాక తాను చెట్టు కొట్టించకుండా ఉండాల్సింది అనుకొన్నాడు మార్కండేయులు.

ఎమర్జెన్సీ వార్డులో చికిత్స జరిగాక మామూలు వార్డుకి అప్పలకొండను మార్చి రక్తం ఎక్కించడానికి సీసా పెట్టారు. మార్కండేయులు డబ్బు ఖర్చు పెట్టడానికి ముందుకు రావడం వల్ల వైద్య లోపం జరగలేదు. మార్కండేయులు సింహాద్రిని హోటలుకు వెళ్ళి ఏదైనా తిని అతని తల్లికి తినడానికి తీసుకు రమ్మని పంపించాడు. అతను రాగానే తను ఇంటికి బయల్దేరాడు. తమ ఇల్లు చేరేసరికి అతని భార్య అప్పలకొండ కుటుంబ సభ్యుల్లో మిగిలిన వాళ్ళకి తిండి పెట్టింది. వాళ్లలో అప్పలకొండకేం భయం లేదు" అని డాక్టర్లు అన్నారని మార్కండేయులు చెప్పి తను స్నానం చేసి భోంచేసి జరిగింది నెమరు వేసుకొంటూ నిద్రపోయాడు.

ఆ సాయంత్రం ఎదురింటి సుబ్బారాయుడు మార్కండేయుల్ని పలకరించడానికి వచ్చాడు. అతడు పై ఊరి నుంచి వ్యాపార నిమిత్తం వచ్చి బాగుపడి మార్కండేయులి ఇంటికి ఎదురిల్లు కొనుక్కుని ఆ ఊళ్ళోనే స్థిరపడ్డాడు.

"మీ ఇంట్లో పొద్దున్న పెద్ద ప్రమాదం జరిగిందని విని వచ్చాను" అన్నాడు సుబ్బారాయుడు.

మార్కండేయులు జరిగింది చెప్పాడు. ప్రమాదం జరిగిన స్థలంకి తీసుకెళ్ళి సుబ్బారాయుడికి చూపించాడు. సుబ్బారాయుడి దృష్టి అప్పలకొండ పాక మీద పడింది.

"ఇదేమిటి ఈ మూలని మూసేస్తూ ఇక్కడ పాకేశారు?" అన్నాడు సుబ్బారాయుడు జరగరాని పని జరిగిపోయిందన్నట్టు "ఈ పాకలో మా అప్పలకొండ కుటుంబం ఉంటోంది. దీన్ని మా నాన్నగారు ఇల్లు కట్టిన కొత్తలో అప్పలకొండ తండ్రి వుండడానికి వేసుకోనిచ్చాడు. నలభై ఏళ్ళక్రితం ఇక్కడంతా ఎలా వుండేదో తెల్సాండీ! ఈ పేటలో వీధికి ఒకటీ అరా ఇళ్ళు తప్ప లేవు. అందులో మా దొక్కటి. ఇప్పుడైతే ఈ పేట ఊరికి సెంటరైపోయి గజం పదిహేనొందలు పలుకుతోంది కాని మా నాన్నగారీ స్థలం కొన్నప్పుడు ఇటువైపు ఊరు పెరగ లేదు. గజం మూడ్రూపాయలకి కొన్నారు. ఆ రోజుల్లో మెయిన్ రోడ్డంబడి మాత్రం ఒకట్రెండు సిటీ బస్సులు నడిచేవి. ఇటు వైపు బస్సులు లేవు. సైకిల్ రిక్షాలు ప్రయాణ సాధనాలు. అప్పలకొండ తండ్రికి సైకిల్ రిక్షా వుండేది. అది అవసరమైనప్పుడు మాకు కట్టేలా ఒప్పందం మీద అతన్ని ఇల్లు వేసుకోనిచ్చారు మా నాన్నగారు. అప్పలకొండ తల్లి మా ఇంట్లో పాచిపని, బట్టలుతకడం, బావి నీళ్ళు తోడి పొయ్యడం చేసేది. నేను అప్పలకొండ తండ్రి రిక్షాలోనే స్కూలుకి వెళ్లే వాడిని ఆ రోజుల్లో. మేము ఇల్లు వేసుకోనిచ్చామన్న విశ్వాసం కొద్దీ వాళ్ళు మాకు డబ్బుకే అయినా కావలసిన పనులన్నీ నమ్మకంగా చేసి పెట్టేవారు. అసలు అప్పలకొండ తండ్రీ చీటి రాసిస్తే పక్క పేట బజార్నుంచి సరకులు తెచ్చి ఇంట్లో పడేసేవాడు. ఆరోజుల్లో ఈ ఊళ్లో

మనుష్యుల మధ్య నమ్మకం చాలా వుండేది'' అన్నాడు మార్కండేయులు, పాత రోజులు నెమరువేసుకొంటూ. అతనికి అప్పలకొండకి ప్రమాదం జరిగినప్పటి నుంచి పాత సంగతులు బుర్రలో గిర్రున తిరుగుతున్నాయి. అందుకని సుబ్బారాయుడి ప్రశ్నకి సమాధానంగా తమకీ అప్పలకొండ కుటుంబానికీ వున్న అనుబంధాన్ని ఏకరువు పెట్టాడు. ఆ తరువాత ''పెరట్లో పాక వేయించి నప్పుడు ఆమూలైనా వేసుకోవాలి, ఈ మూలైనా వేసుకోవాలి, రెండు వైపుల ప్రహరీ గోడలు కలసి రావాలంటే. అటువైపు వేసుకొన్నారు'' అన్నాడు.

''మీరు నన్ను తప్పర్థం చేసు కొన్నారు. మీపని వాళ్ళని మీరు మీ పెరట్లో పాకెందుకు వేసుకోనిచ్చారని అడగడానికి నేనెవడిని. నేను అడిగినదల్లా ఆ పాక ఆ మూల ఎందుకు వేయనిచ్చారు? అని. అది ఈశాన్యపుమూల. మూసేశారు. దాన్ని వాస్తు ఒప్పదు. మీకింత వరకు, ఎవరూ ఈ విషయం చెప్పలేదా?'' అని ఆశ్చర్యంగా అడిగాడు సుబ్బారాయుడు.!?

''లేదే! ఈశాన్యపుమూల మూస్తే ఏమౌతుందిట?'' అని అడిగాడు కొంచెం బెదుర్తూ మార్కండేయులు.

''మీ కుటుంబంలో ఎవరో భళ్లున రక్తం కక్కుకుని చచ్చిపోయి వుండాలి!''

''ఇంతవరకు ఎవరూ రక్తం కక్కుకుని చావలేదు'' అని మార్కండేయులు కాస్సేప్పాగి ఆలోచించుకుని, ''అప్పలకొండ బతుకుతాడనే అనుకొంటాను'' అన్నాడు. అందులో అప్పలకొండని తన కుటుంబంలో మనిషికింద లెక్క పెట్టుకొనే పెద్ద మనుస్సు ,అతను రక్తం కారి చావు బతుకుల మధ్య ఉండడం. ఈశాన్యపుమూల మూసెయ్యడంవల్ల వచ్చిన ప్రమాద మేమోనన్న అనుమానం, అతను ప్రమాదం తప్పి బతకాలన్న ఆకాంక్ష ఉన్నాయి.

''నేను చెప్తున్నది మీ కుటుంబం గురించి. ప్రస్తుతానికి గండం మీ పనివాడి మీదుగా కొట్టుకుపోయింది. ఆ పాక పీకించెయ్యండి'' అన్నాడు సుబ్బారాయుడు.

''ఆ పాక నలభై యేళ్ళుగా ఉన్నదే కదా!''

''బూరుగు చెట్టు మాత్రం చాలా సంవత్సరాలుగా ఉన్నదేకదా ఎందుకు కొట్టించారు? మీకు హార్ట్ ఎటాక్ వచ్చి నిదర్శనం కనిపించింది కనక. మీకు హార్ట్ ఎటాక్ వచ్చిన అయిదు సంవత్సరాలదాకా ఎవరూ మీకా విషయం చెప్పక మీకు తెలియలేదు. తెలిశాక కొట్టించేశారు కదా! ఇప్పటి దాక ఈ మూల ఈ పాకుంటే వాస్తొప్పదని తెలియక ఉంచేశారు. ప్రమాదం జరిగింది. నేనొచ్చి మీకు చెప్పాను. తెలిశాక ఎందుకుంచాలి? తేసేయించండి'.

పాక పీకించి మరోచోట వేయించడానికి మార్కండేయులికి మనసొప్పడంలేదు. కాని అప్పలకొండ భార్యకీ విషయం తెలిస్తే తమ పాక ఈశాన్యపుమూల వుండడంచేత తన భర్త ప్రమాదం జరిగిందనుకొంటుందేమోనన్న ఆలోచన కలిగింది. అప్పలకొండ కల్లాంటి ఆలోచన రాదు. భార్యకి వచ్చినా సర్దిచెప్తాడు. అయినా తను, తన తండ్రి, ఆ ఇంటికి జరిగిన ప్రమాదానికి బాధ్యులు కారు! ఆ పాక వాళ్ళే అటు వేసుకొన్నారు అని మళ్ళీ సర్దుకొన్నాడు.

"వీటికంత ప్రభావం వుంటుందంటారా?" అని మార్కండేయులు సుబ్బారాయుడిని అడిగాడు.

"మీకు మరో నిదర్శనం చెప్తాను. ఈ వీధిచివర డాక్టర్ శర్మ లేడూ ఆయన ఇంటి నెంబరు 13. అది మంచి నంబరు కాదు. ఎన్నిసార్లు చెప్పి చూసినా విన్నాడు కాదు"

"మనకి త్రయోదశి మంచిదే కదా, పదమూడు క్రైస్తవులకి కదా చెడ్డ సంఖ్య"

"మంచి అందరికీ మంచి కాక పోయినా చెడు అందరికి చెడే. మా చుట్టాలతను హైదరాబాద్‌లో 13వ నంబరు ఫ్లాట్ కొన్నాడు. అతనికప్పుడీ మాటే చెప్తే దాన్ని 12-ఎ అని మార్పించుకున్నాడు. అందుకే ఏ ప్రమాదం లేకుండా దిమ్మచెక్కలా వున్నాడు".

"మార్పించుకోక పోయినా వుండేవాడేమో కదా!" అన్నాడు నవ్వుతూ మార్కండేయులు. అతనికి చెడు జరగడం పట్ల భయం వుంది. కాని అప్పుడప్పుడు అతని బుద్ధి తర్కాన్ని తవ్వుతుంది.

"ఉండేవాడు కాదు! ఇందాక చెప్తున్నానే డాక్టర్ శర్మ విన్నాడు కాదు నేనెంత చెప్పినా. ఏమైంది! తను డాక్టరైవుండి రెండేళ్ళుగా కాన్సర్‌తో తీసుకొంటున్నాడు. అంతే అయ్యేది మావాడి పని కూడాను" అన్నాడు సుబ్బారాయుడు వీధి వైపు నడుస్తూ.

"నాకో చిన్న సందేహం! మా ఇంట్లో బూరుగు చెట్టు ముప్పై యేళ్ళ పైగానే వుంది కదా ఈపాక ఈశాన్యపూమ్మల నలభైయేళ్లగా ఉందికదా! డాక్టర్ శర్మగారి ఇంటికి పదమూడు నంబరు పదేళ్ళుగా వుంది కదా. ప్రమా దాలన్నీ ఇన్నాళ్ళకి ఇప్పుడే ఎందుకు జరుగుతున్నాయి?' ' అని అడిగాడు మార్కండేయులు గేటు దగ్గర.

ఇంటికి వెళ్ళబోతున్న సుబ్బారాయుడు ఆగి సమాధానం చేప్పే ప్రయత్నంలో ఓ ప్రశ్న వేశాడు.

"మీకు హార్ట్ ఎటాక్ ఎందుకు వచ్చింది?"

"కొలెస్ట్రాల్ ఎక్కువై"

"అదెందుకు ఎక్కువైందిట?"

"చిన్నప్పటి నుంచి వెన్న, మీగడ, నెయ్యి, వేపుళ్ళు తినడం వల్ల"

చిన్నప్పటి నుంచి తిన్న కొవ్వు మీకు మొన్న దెబ్బ కొట్టింది అవునా?"

"అవును"

"అంటే ఏ చెడైనా దాని ప్రభావం చూపించడానికి చాలా కాలం పడ్తుంది. అది కొద్ది కొద్దిగా పేరుకొని ప్రమాదకర స్థాయిని చేరుకోగానే టపీమని ప్రభావం చూపించి ఊరుకొంటుంది. తాగుడు, పొగ తాగడం ఇవన్నీ అంతే కదా! వాస్తులాంటివి కూడా వాటి ప్రభావం చూపించడానికి టైము తీసుకొంటాయి. సకాలంలో చర్య తీసుకొంటే ప్రమాదం నుంచి రక్షించుకోవచ్చును. డ్రగ్స్ వున్నాయనుకోండి అవి తీసుకోడం మానెయ్యడం విరుగుడు మందులు తీసుకోవడం

చెయ్యాలి. గ్రహాల విషయంలో ఆ విరుగుడు చర్యలు పూజలు, శాంతులు, వాస్తు విషయంలో వాస్తు విరుద్ధమైన వాటిని మనం తొలగించి, పూజలు చేసి అప్పటి వరకు పేరుకొన్న చెడును తొలగించు కొంటాం. మీ మంచితనం వల్ల మీకు వాస్తు చెడు ప్రభావం కొంత కాస్సలయింది. అందుకే ఇవాల్టిదాకా ఏ ప్రమాదం రాలేదు. అన్నట్టు నేనీ మధ్య బిల్డింగ్ కాంట్రాక్టులు కూడా చేస్తున్నాను. మీ ఇంటికి వాస్తు ప్రకారం అవసరమైన మార్పులేమైనా చేయించ దలచుకొంటే నేను చేసి పెడ్తాను'' అంటూ సుబ్బారాయుడు మార్కండేయులికి తను చెప్తున్నది తర్కబద్ధమైనదేనన్న అభిప్రాయం కలిగించ చూశాడు.

మార్కండేయులికి సుబ్బారాయుడి వాదం సరిగ్గానే వుందనిపించిది. సాయంత్రం అప్పలకొండని చూడడానికి ఆస్పత్రికి బయల్దేరి వీధి చివరకి వచ్చేసరికి వరండాలో శర్మ తీరుబడిగా కనిపించారు.ఆయనకి కాన్సరు వచ్చాక పేషెంట్లు ఇంటికి వచ్చి ఆయన్ని బాధించడం తగ్గించారు. మార్కండేయులికి డాక్టర్ శర్మ అంటే గౌరవం వుంది. ఇతని తల్లికి కంటి జబ్బు వచ్చిప్పుడు మార్కండేయులు ఇంటికి వచ్చి చూశాడు . మొహమాట పడి డబ్బు ఇవ్వబోతే పుచ్చుకోకుండా.

"నేను మీ ఇంటికి ఇరుగుపొరుగువాడిగా వచ్చాను. మీ అమ్మగార్ని డాక్టరుగా పరీక్షించిన మాట నిజమే. మీరు ఆవిడను ఆస్పత్రికి తీసుకొచ్చినా నేనే కదా పరీక్షించేది అక్కడ డబ్బు పుచ్చుకోనుకదా! అక్కడ పని తగ్గించుకొన్నాను ఇక్కడ పరీక్షించి. దానికి డబ్బెల్లా తీసుకొనేది!'' అన్నాడు నవ్వుతూ.

అంతమంచి డాక్టర్ శర్మ, ఇప్పుడు జబ్బుతో బాధపడుతున్నాడు. అది తొలగించడానికి తనకి తెలిసిన చిట్కా తను చెప్పాలనిపించింది మార్కండేయులికి. గేటు తెరుచుకుని లోపలికి వెళ్లాడు.

"రండి మార్కండేయులు గారూ రండి'' అంటూ ఆహ్వానించాడు శర్మ. కాస్సేపు అదీ ఇదీ మాట్లాడాక, "మీ వంట్లో ఎలా వుంది?'' అని అడిగాడు మార్కండేయులు శర్మని.

"ఏముంది కాన్సర్ కదా! అందులో బోన్ కాన్సర్ .ఎప్పుడో ఎముకలు డొల్ల బారి విరిగిపోతాయి. అది రేపే జరగవచ్చు'' అన్నాడు శర్మ నిర్లిప్తంగా.

"అపశకునం మాటలు అనకండి. తథాస్తు దేవతలుంటారు'' అన్నాడు మార్కండేయులు.

శర్మ వాదానికి దిగదలుచుకోక మాట మార్చాడు మార్కండేయులే మళ్ళీ.

"మీ ఇంటి నంబరు 12-ఎగా మార్చుకోరాదా! పదమూడు మంచి సంఖ్య కాదుకదా! అన్నాడు.

"నంబరు మారిస్తే, యమదూతలు చీటి మీద 13 అని వ్రాసుకు రావడం వల్ల ఇల్లు కనపడక చిరునామాదారుడు దొరకలేదు అనో, తలుపుకి తాళం వేసుంది అనో వెళ్ళి

యముడికి రిపోర్టివ్వడానికి అదేమన్నా పోస్టల్ డిపార్టుమెంటా? అయినా 13 క్రైస్తవులకి చెడ్డ సంఖ్యగాని హిందువులకి త్రయోదశి మంచిదే కదా! పోనిద్దురూ" అన్నాడు శర్మ. అతను ఎవరి నమ్మకాలు వాళ్ళవి. ఇతర్ల నమ్మకాలని కాదనడం దేనికి అనుకొంటాడు. కాని మార్కండేయులు నమ్మకాపనమ్మకాల మధ్య ఊగిసలాడ్తున్నాడు.

"మార్చడానికి ప్రయత్నించనంటారా?" అని అడిగాడు మార్కండేయులు.

" పదేళ్లుగా వున్న నంబరు. ఇన్ని సంవత్సరాలు రాని ప్రమాదం ఈ సంవత్సరం వచ్చినా దానికి నంబరుకి సంబంధం వుండదు కదా!" శర్మ మార్కండేయులు సుబ్బారాయుడికి చెప్పిన మాటలే కొద్ది మార్పుతో అన్నాడు.

మార్కండేయులు వెంటనే సుబ్బారాయుడు చెడు ప్రభావాలు పేరుకోవడం గురించి చేసినవాదం పునశ్చరణ చేశాడు.

శర్మ నవ్వాడు.

"ఎనాలజీలు వేరండి. ఋజువులు వేరు. ఉపమానాలు అందంగా, అర్థం చేసుకోడానికి ఉపయోగకరంగా ఉంటాయేగాని చెప్తున్న విషయం సత్యమేనని ఋజువు చెయ్యవు. తెలివైన వాడు ఎటువైపునైనా వాదించ గలడు, మన న్యాయవాదులలాగా. కొరెలేషన్స్ వేరు. కాస్ ఎండ్ ఎఫెక్ట్ రిలేషన్స్ వేరు. సైన్సు నిండా స్పూరియస్ కొరెలేషన్స్‌కి నిదర్శనాలు కనిపిస్తాయి. ఇదో పెద్ద శాస్త్రం లెండి".

మార్కండేయులు వాదం పొడిగించ లేదు. కాస్సేపు కూర్చుని ఆయన్ని ఆరోగ్యం గురించి జాగ్రత్త తీసుకోమని చెప్పి లేచి ఆస్పత్రికి వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు నడుస్తుండగా శర్మగారి ఎముకలు విరిగాయని అస్పత్రిలో జేర్చారని మార్కండేయులు విన్నాడు. అదే రోజున అప్పలకొండని కొద్ది రోజుల్లో డిస్ఛార్జి చేస్తానని చెప్పాడు డాక్టరు మార్కండేయుల్తో.

అప్పలకొండని ఆస్పత్రి నుంచి ఇంటికి పంపించిన రోజున మార్కండేయులు మనస్సు తేలికపడింది. అప్పలకొండ తను చెప్పిన పనిచేస్తూ చచ్చిపోనందుకు దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకొన్నాడు. సత్యనారాయణ వ్రతం, వెంకటేశ్వరుడి దీపారాధన చెయ్యాలనుకున్నాడు.

మర్నాడు పొద్దున "డాక్టర్ శర్మ పోయాడుట విన్నారా?" అంటూ వచ్చాడు సుబ్బారాయుడు. అతను శర్మవల్ల ఉపకారం పొందినవాడే అయినా తన సలహా శర్మ పాటించనందుకు శర్మ పట్ల కినుక వహించి, "నేను చెప్పిన మాటవిననందుకు అనుభవించాడు" అన్న ధోరణిలో మాట్లాడాడు.

మార్కండేయులు చెప్పులు వేసుకొని శర్మ ఇంటి వేపు వెళ్ళాడు. అప్పటికే అక్కడ అతని అభిమానుల గుంపు వుంది.

"బాడీ వచ్చిందా?" అని అడిగాడు మార్కండేయులు. బాడీని చూడడం ఓ ఆచారం గౌరవంగా భావిస్తాడతను.

"అస్పత్రిలోనే వుంది" అన్నాడు అక్కడున్న ఆయన.

"ఎవరైనా బంధువులు రావాలా?"

"లేదు"

"మరి?"

అప్పుడక్కడున్న ఓ కుర్ర డాక్టర్ను కల్పించుకుని "మా ప్రొఫెసర్ గారు తన బాడీకి అంతిమ సంస్కారాలు అనవసరం అని దాన్ని ఏ విధంగా నలుగురికి ఉపయోగపడ్తే ఆ విధంగా ఉపయోగించుకోవచ్చునని విల్లు వ్రాశారు. తనది కాన్సర్ దేహం కనక దాన్ని ముక్కలుగా కోసి కాన్సరెందుకు వస్తుందో ఎలా నివారించవచ్చో రిసెర్చి చేసి కనుక్కోడానికి ఉపయోగిస్తే బావుంటుందని సూచించారు" అని ఎంతో గౌరవంతో చెప్పాడు.

"మరి కర్మ చెయ్యడా ఆయన కొడుకు?"

"చెయ్యరు. ఆయన తను పోయినప్పుడు ఎవరూ ఏడ్వరాదనీ, కర్మ చెయ్యరాదనీ, మర్నాటి నుంచి ఎవరి పనులు వారు ఎప్పటి లాగా చేసుకోవాలనీ కుటుంబ సభ్యుల నుంచి వాగ్దానం తీసుకొన్నాడు."

"అవును. మరి... ఆయన ఆత్మ...?" మార్కండేయులుకి ఇంకా సందేహాలు నివృత్తికాలేదు.

డాక్టరు శర్మ ఇంటికి వచ్చే బీద పేషంట్లకి, రిక్షా వాళ్ళకి, టీలు అమ్మే అతను సమాధానం ఇచ్చాడు.

"బాబు! సచ్చినోళ్ల విషయంలో కదా మనం ఆత్మల పెసక్తి తెచ్చేది. శర్మ బాబుకి సావునేదు. మనం బతికుండాలే గానీ ఆ బాబెప్పుడూ మన మనసుల్లో బతికే ఉంటారు" అన్నాడు శర్మపట్ల భక్తి చూపిస్తూ.

మార్కండేయులికి హఠాత్తుగా బతుకు గురించిన అవగాహన ఏర్పడింది. మనిషి ఆలోచించాల్సింది ఎల్లాగో భూమ్మీద బతికెయ్యాలని కాదు, అందరి మనస్సులో కలకాలం బతికే ప్రయత్నం చెయ్యాలి. సుబ్బారాయుడు మరికొందరు చావు నుంచి రక్షించుకునేందుకు చెప్పే మాటలు నమ్మడం వ్యర్థం, అవి సత్యమే అయినా కీర్తి శేషించు కోడంద్వారా చావును జయించాలని చూడాలిగాని చావుకి దొరక్కుండా పారిపోవటానికి మనిషి చేసే ప్రయత్నాలకి అర్థం లేదు. మార్కండేయులుకి ఈశాన్యప్మూలల, ఈశ్వర దేవస్తానాల గురించిన భయాలు ఆ క్షణాన తొలగిపోయాయి. ●

(మృత్యుంజయుడు డాక్టర్ చావలి మంగయ్య శర్మ స్మృతికి).

(ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేకసంచిక 1990)